నీలిమ మాసపత్రిక (మే 79)

# బలవంతుని రాజ్యంలో...

పెద్దిరెడ్డిగారి నౌకరు వచ్చి, "దొరగారు అరిజెంటుగా రమ్మన్నారు డాక్టరుగారూ!" అన్నాడు. కుటుంబరావు భార్యవైపు చూసాడు.

"ఎలాగూ వెళ్ళాలనుకుంటున్నారుగా! కబురు కూడా వచ్చింది. వెళ్ళిరండి. శాంత పెళ్ళికి ముహూర్తం పెట్టించేస్తున్నామని చెప్పండి. ఎంత సాయం చేస్తారో ఆయనే చెపుతారు" అని ప్రోత్సహించింది ఆమె.

కుటుంబరావు ఆ వూళ్ళో స్కూలు టీచరే కాదు - వైద్యుడు కూడా. ఆయుర్వేదం, హోమియోపతీ, అల్లోపతీ అన్ని రకాల మందులూ వాడతాడు. అందర్కీ అతని మందులమీద గురి వుంది. దీనికో దానికో అతనితో అందరికీ పని ఉంది. అందులో గ్రామ పెద్ద పెద్దిరెడ్డికి పని వుండడంలో వింతేముంది!

పెద్దిరెడ్డి యింటికి వచ్చాక, ఆయన మాటలు విన్నాక కుటుంబరావు ఆనందానికి అవధులే లేకపోయాయి. ఆడబోయిన తీర్థమెదురయినట్టు ఆయన సరాసరి అతని కూతురు పెళ్ళి

సంగతే ఎత్తాడు. ఎప్పుడు ముహూర్తం పెట్టిస్తున్నారన్నాడు. ఎంత ఖర్చవుతుందనుకుంటున్నా రన్నాడు. నిర్మొహమాటంగా అతనికేం కావల్సినా అడగమన్నాడు. అడక్కుండా అన్నీ అమర్చే దేవునిలా మాట్లాడాడు.

"మీ ఋణం ఎప్పటికీ తీర్చుకోలేనండయ్యా!" అన్నాడు కుటుంబరావు ఆనందభాష్పాలు కళ్ళల్లోకి పొంగివస్తుండగా.

పెద్దిరెడ్డి గలగల నవ్వాడు. 'బలేవాడివయ్యా! తోటి వాడికి ఆ మాత్రం సాయం చేయకపోతే మేమంతా ఎందుకు?' భుజం తట్టి అన్నాడు. కుటుంబరావు సంతోషాన్ని మరింత పెంచు కుంటూ పోతూ, అతని కొడుకు ఉద్యోగం విషయం కూడా ఎత్తాడు పెద్దిరెడ్డి ప్రస్తుతానికి పట్నంలో ఓ షాహుకారు కొట్లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. రోజూ ప్రొద్దున్న బయలుదేరి సైకిలు మీద వెళ్ళి రాత్రికి తిరిగి వస్తున్నాడు.

"ఎన్నాళ్ళలా పద్దులు రాస్తూకూర్చుంటాడు? ఉండు – మీ వాడికేదయినా మంచి ఉద్యోగం వేయిస్తాను. బలే వాడివయ్యా? ఇది కావాలి – అది కావాలి అని అడగనేనా అడగవు" అని మురిపెంగా కోప్పడ్డాడు పెద్దిరెడ్డి.

ఆయనకి తన మీద యింత అభిమానం ఉందని కుటుంబరావుకి ఇన్నేళ్ళల్లో ఎప్పుడూ అనిపించలేదు. ఏదో పని వుందని పిల్చినవాడు తన కూతురి పెళ్ళి సంగతి ఎత్తాడు. అడుగుదామనుకున్న దానికంటే ఎక్కువే సాయం చేస్తానన్నాడు. ఇప్పుడు అడక్కుండానే కొడుక్కు ఉద్యోగం వేయిస్తానంటున్నాడు. కుటుంబరావుకి అంతా కలగా ఉంది. ఆనందంతో ఉక్కిరిబిక్కిరి అయిపోతున్నట్టుగా ఉంది.

ఏమిటీ అంతుపట్టని అభిమానానికి కారణం – అని అతను ఆశ్చర్యపోతుండగా, నెమ్మదిగా తన మనసులోని మాట బయటపెట్టాడు పెద్దిరెడ్డి.

"సుబ్బమ్మ కూతురు రత్తాలు పొరపాటున కాలుజారింది. గర్భవతి అయింది. నలుగురికీ తెలిస్తే అభాసవుతుంది. ఆమెకిక పెళ్ళెలా అవుతుందా అని ఆ తల్లి బెంగపెట్టుకుపోయింది. రత్తాలుకి ఒక్కడోసు మందిస్తే ఈ గండం నుంచి బయటపడుతుంది. వాళ్ళమ్మ నెత్తిమీద బరువు దిగుతుంది" అన్నాడు పెద్దిరెడ్డి.

కుటుంబరావు అయోమయంగా చూసాడు.

"నీ హస్తవాసి మంచిది. ఒక్క చిట్కాతో పెద్ద పెద్ద రోగాలే నయమవుతుంటాయి. ఈ చిన్న పని నీకో లెక్క కాదు. పడుచుతనం చేసిన తప్పు. ఆ తప్పు కాయకతప్పదు మరి!" పెద్దిరెడ్డి నొక్కి చెప్పాడు.

"ఇంత పని చేసిందెవరండీ?"

"ఎవరయితేనేముంది? ఫలితం అనుభవిస్తున్నది రత్తాలే కదా! ముందుదాని బ్రతుకు సంగతి చూడాలి మనం."

"నేనూ అందుకే అడుగుతున్నానండీ! అదెవరో తెలిస్తే నయానా భయానా చెప్పి వాళ్ళకి

పెళ్ళి చేయించేస్తే మందు మాకులతో పని వుండదు కదా?"

"దానికి వీలుంటే నిన్ను పిలవాల్సిన అవసరమేముంది? నీ సందేహాలన్నీ కట్టిపెట్టి ముందు జరగవల్సిన పని చూడు" అని పెద్దిరెడ్డి విసుక్కున్నాడు.

"అయ్యో! కడుపు పోగొట్టటమంటే భ్రూణ హత్యండీ! నేనీ ఘోరం మాత్రం చేయలేను. నా యందు దయుంచి నన్నీ పని చేయమనకండయ్యా!" అన్నాడు కుటుంబరావు వణికే కంఠంతో.

"అసలు వాళ్ళకి లేని పాపం, భయం నిన్ను పట్టుకున్నాయేంటయ్యా! దాని బ్రతుకు కాయమంటున్నా కాని – కూలదోయ మనటం లేదు కదా!"

"నా మనస్సెందుకో ఒప్పుకోవటం లేదు రెడ్డిగారూ! నేనెప్పుడూ ఇలాంటి పని చేయలేదు. ఇప్పుడూ చేయలేను. నన్ను మరోలా అర్థం చేసుకోకండి."

"ఇంత మంకు పట్టు పనికిరాదు మాస్టారూ! మనిషిని బట్టి మసులుకుంటుండాల. అంతరం తెలిసి మాట్లాడాల" అని కసురుకున్నాడు పెద్దిరెడ్డి.

కుటుంబరావు దిగాలు పడిపోయాడు. "అంత మాటనకండి. మీ మాట కాదనాలనికాదు. మరో మార్గంలో ఈ సమస్య పరిష్కరించటం మంచిదంటున్నాను. రత్తాల్ని మోసం చేసిందేవరో తెలుసుకుంటే..."

"ఆ పని నాకు చేత కాదనే నీ వుద్దేశమా?"

"ఎంత మాట! ఊరి పెద్దలు తమకి చేతకాదంటానా?"

"ఒకవేళ నీ కూతురే అలాంటి పని చేసి కడుపు తెచ్చుకుంటే ఏం చేసుండేవాడివి? ఇలాగే 'పాపం – పాపం' అంటూ చూస్తూ వూర్కునే వాడివేనా?"

కుటుంబరావు మనస్సు చివుక్కుమంది. 'నా కూతురికే యిలా జరిగితే కడుపుకోత కంటే గెండె కోతకే పాల్పడే వాడిని' అని అనాలనుకున్నాడు. కాని, అంత ధైర్యం అతనికెక్కడిది? చండశాసనుడనిపించుకున్న పెద్దిరెడ్డి భయంకరమైన ముఖం ఎదురుగా ఉంది.

"ఇప్పటికి పాతికేళ్ళ నుంచి వైద్యం చేస్తున్నాను. అనేకమందికి మందిచ్చాను. ఒక అన్యాయాన్ని తప్పి పుచ్చుటానికి మాత్రం యింతవరకు నా వృత్తిని ఉపయోగించుకోలేదు. ఎంత సర్ది చెప్పుకుందామన్నా నాకీపని సాధ్యం కాదనిపిస్తోంది. నన్ను క్షమించదయ్యా!"

"నీతులు నియమాలు చెపుతావేంటోయ్! ఇంతకాలం ఆ అవసరం రాలేదు. ఇప్పుడు వచ్చింది కనుక అడుగుతున్నాను. నిన్నూరికే చేయమనటం లేదు. నీ కూతురి పెళ్ళికి సాయం చేస్తానన్నాను. కొడుక్కి ఉద్యోగం వేయిస్తానన్నాను. ఆ మాత్రం విశ్వాసమయినా లేదూ?"

కుటుంబరావుకి ప్రాణం ఉస్సూరుమంది. అంతకు ముందు పెద్దిరెడ్డి అనుగ్రహం ఎంత హఠాత్తుగా పొంగి వచ్చిందో – ఆయన ఆగ్రహం అంత తొందరగానూ త్రోసుకువస్తోంది. ఆయన్ని కాదని ఆ వూళ్ళో ఎవరు నెగ్గుకు రాగలుగుతున్నారు?

తన్ను పెద్దిరెడ్డి బలవంతంగా యీ వ్యవహారంలోకి దించుతున్నాడు. ఎందుకని? ఆయనకి

తెలియకుండా సుబ్బమ్మ కాని రత్తాల్ని కాని కలిసి జరిగింది తెల్సుకోవాలి! ఇందులోంచి లౌక్యంగా తప్పించుకోవాలి తప్ప, మొండిగా మాట్లాడితే పెద్దిరెడ్డి తన్ను వదిలిపెట్టడు. అందుకనే "ఒక సారి రత్తాల్ని అడిగి ఎన్నో మాసమో తెలుసుకుంటే సరయిన మందివ్వటానికి వీలుంటుందండి" అన్నాడు కుటుంబరావు.

అతని వైపు సూటిగా చూసాడు పెద్దిరెడ్డి. "సరే" అని పక్కగది గొళ్ళెం తీసాడు. లోపల వున్న సుబ్బమ్మని రత్తాల్ని బయటికి పిలిచాడు. "రెండు రోజుల్నించి ఈ ముండల్ని కాయలేక చస్తున్నాం" అన్నాడు.

ఏమిటో అర్థం కాక కుటుంబరావు తెల్లబోయాడు.

"ఏమే! నీ కూతురికెన్నో మాసమో మాస్టరడుగుతున్నారు – చెప్పు" అన్నాడు పెద్దిరెడ్డి.

"నాకేం తెలుత్తది బాబూ! అంతా నా కర్మ" అంది సుబ్బమ్మ తల పట్టుకుంటూ.

"అసలు రత్తాలు కిలా కావటానికి కారణం ఎవరు సుబ్బమ్మా?" అన్న ప్రశ్న అప్రయత్నంగా కుటుంబరావు నోటి వెంట వచ్చింది.

సుబ్బమ్మ తలెత్తి పెద్దిరెడ్డి వైపు భయం భయంగా చూసింది.

"చెప్పవే ముండా! చెపితే కాని మాస్టరు మందియ్యడంట" అన్నాడు పెద్దిరెడ్డి హేళనగా.

"అది కాదండయ్యా!"

కుటుంబరావు మాటలకడ్డు వచ్చాడు పెద్దిరెడ్డి "చాల్చాల్లేవయ్యా! మందియ్యమంటే ఏటేటో గునుస్తున్నావు. చేతిలో మనిషిని కదాని నిన్ను పిలిపించాను కాని – మరో డాక్టర్ని రప్పించ లేననుకున్నావా? మరో చోటికి తీసుకెళ్ళి మందిప్పించలేననుకున్నావా?"

కుటుంబరావుకి తల కొట్టేసినట్టనిపించింది. ఎదురుగా సుబ్బమ్మ ఉండగా తనని పెద్దిరెడ్డి నానా మాటలూ అనటం అతను సహించలేకపోయాడు. "వీళ్ళ గురించి మీరు నా మీద కోప్పడతారెందుకండీ?"

కుటుంబరావు తీక్షణ స్వరానికి క్షణంపాటు గతుక్కుమన్నాడు పెద్దిరెడ్డి.

'వాళ్ళకి నాతో అవసరం వుంటే నా దగ్గరికే వస్తారు. ఈ విషయంలో మీరూ నేనూ తగవు పడటం అనవసరం" అన్నాడు కొంత ధైర్యం తెచ్చుకొని.

పెద్దిరెడ్డి ముఖం జేపురించింది. "వాళ్ళకేం కాదు – నాక్కూడా నీతో అవసరం ఉంది. అందుకే నిన్ను పిలిపించాను. నీతో నిజం చెప్పటానికి నాకేం భయంలేదు. రత్తాలికి కడుపుచేసింది మావాడే! తెలిసిందా!"

కుటుంబరావు ఉలిక్కిపడ్డాడు. "మీ... మీ అబ్బాయా?"

"అవును. మా వీరారెడ్డి. వాడేదో సరదా తీర్చుకోటానికి రమ్మన్నాడు. ఆ ముండ వచ్చింది. వచ్చింది గప్‌చిప్‌గా వూరుకుండా – కడుపు తెచ్చుకుంది. వస్తే వచ్చింది, ఎక్కడికేనా పోయి మందో మాకో తిని తీయించుకుండా అంటే లేదు. మా వాడితో దీనికి పెళ్ళి కావాలిట! ఎంత ధైర్యమో చూడు ముండకి. చేసుకోక చేసుకోక మా వాడు దీన్నే చేసుకోవాలా?" అని

పగలబడి నవ్వాడు పెద్దిరెడ్డి.

కుటుంబరావుకి మతిపోయినట్టయింది.

"ఈ ముండని బయటకొదిలి పెడితే మమ్మల్ని వీధిలోకి లాగుతుంది. గప్‌చిప్‌గా ఈ నాలుగు గోడల మధ్యే దీనికడుపు తీసెయ్యాలి."

కుటుంబరావు ఉలిక్కిపడటం చూసి గలగల నవ్వాడు పెద్దిరెడ్డి. "కంగారు పడకోయ్! దానికేం అన్యాయం చేయన్లే. ఎవడ్నో చూసి పెళ్ళి చేయిస్తాను. ఆ ఖర్చంతా నేనే పెట్టు కుంటాను. సరేనా! నీ కష్టం కూడా నేనుంచుకోను. ఏం సాయం కావాలన్నా చేస్తాను. ఇక్కడేం జరిగినా మన మధ్యే ఉంటుంది. ఏమంటావ్?" అన్నాడు పెద్దిరెడ్డి.

తన కొడుకే యీ ఘోరానికి కారకుడని పెద్దిరెడ్డి నిజం చెప్పినందుకు కుటుంబరావు సంతోషించలేదు. చేసింది పాపమని అతనికి చీమంతయినా చింత లేకపోయినందుకు బాధ కలిగింది. ఒక పాపం చాలక తాము చేస్తున్న మరో పాపంలో తనని కూడా పాలు పంచుకోమని వత్తిడి చేస్తున్నందుకు అసహ్యమేసింది.

'ఈ పని చెయ్యనని అంటే పెద్దిరెడ్డి ఏం చేస్తాడు? శాంత పెళ్ళికి సాయం చెయ్యనంటాడు. సత్యానికి ఉద్యోగం వేయించడు. అంతే కదా! ఈయన సాయం లేకపోతే దాని పెళ్ళి ఆగిపోదు కదా! వాడి కుద్యోగం రాకపోదు కదా! మరికొన్నాళ్ళు తమ కష్టపడాల్సి వస్తుంది. ఆ కష్టమయినా భరించవచ్చు కాని ఈ మహాపాపం మాత్రం చేయకూడదు.'

కుటుంబరావు ఆలోచనలకి అడ్డు వస్తూ "మాట్లాడవేమయ్యా మాస్టరూ!" అన్నాడు పెద్దిరెడ్డి.

"ఇది నా వల్ల కాదండి!" అన్నాడు కుటుంబరావు టక్కున పైకి లేస్తూ.

'అంటే, ఏమిటి నీ ఉద్దేశ్యం?" అని అరిచాడు పెద్దిరెడ్డి.

"ఏమీ లేదండి! మరెవరి చేతయినా ఈ పని చేయించండి. నన్ను వదిలిపెట్టండి!"

"నువ్వేదో ఉద్ధరిస్తావని ఈ సంగతులన్నీ చెప్పాను. ఇప్పుడు నిన్ను వదిలిపెడితే వూరంతా చాటించకుండా ఉంటావా?"

"ఎవరికీ చెప్పనండి – నా మాట నమ్మండి!"

"ఇంతవరకు వచ్చాక నిన్నెవడు నమ్ముతాడు?" అని గది బయటికి వెళ్ళి కేక పెట్టాడు పెద్దిరెడ్డి. అతని కొడుకులు వీరారెడ్డి, రంగారెడ్డి వచ్చారు.

"వీడు మంచి మాటలతో చెపితే వినేలా లేడురా! కాళ్ళూ చేతులు కట్టేయ్యండి!"

తండ్రి మాటలు విని తాళ్ళు తీసుకొని వచ్చారు కొడుకులు.

కుటుంబరావు ముఖం జేవురించింది. "దౌర్జన్యంగా నా చేత ఏమీ చేయించలేరు. చావనయినా చస్తా గాని."

"చస్తావా! సర్లే, ముందిలా చావు" అని కుటుంబరావు చెంపలు వాయగొట్టాడు పెద్దిరెడ్డి. అతని తల అదిరిపోయింది. పెదవులమీదకి నెత్తురు చిందింది. పెద్దిరెడ్డి కొడుకులతనిమీద పడి బలవంతంగా కాళ్ళూ, చేతులూ కట్టేశారు.

"అయ్యో! మా మూలంగా ఆయన్నెందుకు కొడతారయ్యా" అంది సుబ్బమ్మ ఏడుస్తూ.

"నోరెత్తావంటే చంపిపారేస్తాను ముండా!" అని హుంకరించాడు పెద్దిరెడ్డి.

"ఏదో రోజున మీ పాపం పండుతుంది. మీకు శాస్తి జరుగుతుంది.." కట్లు విడిపించుకోవాలని చేతులూ, కాళ్ళూ గింజుకుంటూ వాళ్ళను శపిస్తున్నాడు కుటుంబరావు.

"వాడి నోరు మూయించరా ముందు" అన్నాడు తన కాలితో కుటుంబరావు మూతి మీద తన్నిన పెద్దిరెడ్డి. అతనా దెబ్బకి వెనక్కి పడిపోయాడు. నోటి నిండా రక్తం. అతనింకా ఆ అదిరిపాటునుంచి తెప్పరిల్లలేదు. పెద్దిరెడ్డి కొడుకులు అతని నోట్లో గుడ్డలు కుక్కారు. వూపిరి సలపక అతనికి స్పృహ తప్పిపోయింది.

మళ్ళీ అతనికి తెలివి వచ్చేసరికి ఒళ్ళంతా హూనమైపోయినట్టుంది. తల బ్రద్దలయిపోతున్నంత నొప్పి. కాళ్ళు చేతులు విరిగిపోతున్నంత పోటు. నోరు కదపటానికి లేదు. ఏ క్షణంలోనయినా తన ప్రాణం పోతుందనిపించిందతనికి.

"వాడ్ని లేవదీసి కూర్చో పెట్టండిరా!"

పెద్దిరెడ్డి గొంతు ఖంగుమని పలికింది. ఆయన సుపుత్రులు పక్కకి వొరిగిపోయిన బస్తాని లేవదీసి కుదేసినట్టు కుటుంబరావుని కూర్చోబెట్టారు. పెద్దిరెడ్డి పురమాయించాడు. వాళ్ళతని నోట్లోని గుడ్డలూడదలాగారు.

"మంచినీళ్ళు కావాలేమో ఇవ్వండిరా!"

రంగారెడ్డి కుటుంబరావు నోట్లోకి మంచి నీళ్ళ గ్లాసు ఒంపాడు. కుటుంబరావుకి పోతున్న ప్రాణం తిరిగి వచ్చినట్టనిపించింది.

"ఏంరా! ఇప్పటికయినా ఒప్పుకుంటావా?"

కుటుంబరావు పిచ్చివాడిలా చూస్తూండిపోయాడు.

"నువ్వు ఇవ్వమన్నావని చెప్పి నీ మందుల సంచీ మీ ఇంటి దగ్గర్నించి తెప్పించాను. అంతా సిద్ధంగా ఉన్నాయి. దానికో ఇంజక్షన్ పొడిచెయ్యి. నిన్ను వదిలేస్తాను. హాయిగా ఇంటికెళ్ళిపోదుగాని. మాటిచ్చినట్టు నీ కూతురి పెళ్ళికి సాయం చేస్తాను. నీ కొడుక్కి ఉద్యోగం వేయిస్తాను."

కుటుంబరావు రత్తాలువైపు దిగులుగా దిగాలుగా చూశాడు.

"నా కొద్దుబాబూ! నన్ను సంపకండి బాబూ! నానెవర్తోను సెప్పను. నన్నొగ్గేయండి!" రత్తాలు ఏడుస్తోంది.

"నువ్వూరుకోవే దొంగముండా! నిన్నొదిలి పెడితే ఇంకేమన్నా వుందా? మా పరువు వీధి కెక్కించవూ?"

"ఊరొదిలి ఎల్లిపోతాం దొరా! ఒగ్గేయ్యండి దొరా!" సుబ్బమ్మ అతని కాళ్ళ వేళ్ళబడి బ్రతిమాలుతోంది.

"మరయితే ముందేపోక, మా కాడికెందుకు వచ్చావే ముండకానా? నీ కూతుర్ని కోడల్ని

చేసుకోమనటానికి నోరెలా వచ్చిందే నీకు?"

"నా నట్టాగనలే బాబూ! నా కూతురి కట్టం సెప్పుకున్నానంతే!"

"మరి నోర్మూసుకుపోక మావాడు కడుపు చేశాడని ఏం చేయమంటారని అడిగావెందుకు? అంటే, ఏంటి నీ ఉద్దేశ్యం? బెదిరించి డబ్బు గుంజాలనేగా?"

"లేదు బాబూ! తప్పయిపోనాది బాబూ! ఎవర్తోటి ఈ మాటన్ను. మా దార్ని మేం పోతాం. నా కూతుర్నేం సెయ్యద్దు దొరా! నాకేం డబ్బులియ్యద్దయ్యా! మమ్మల్నొగ్గెయ్యండి. మేమూరిడిసిపోతాం దొరా!"

పెద్దిరెడ్డి కొడుకులవైపు చూశాడు – "ఏమంటార్రా?"

"లాభం లేదు నాన్నా! వీళ్ళని నమ్మకూడదు. ఒకసారి వెధవబుద్ధి పుట్టిందంటే అది వదల్దు" అన్నాడు వీరారెడ్డి.

"పోతూ పోతూ ఎవరి చెవిలోనో వూదెళ్ళారనుకో. అది చాలు – మన పేరు చెడకొట్ట టానికి. కడుపు తీసేస్తే ఇంకెవరూ నమ్మరు" అన్నాడు రంగారెడ్డి.

"మరయితే, నీ పని కానియ్యి మాస్టరూ! మాస్టరు కట్లిప్పెయ్యండిరా!"

తండ్రి మాట అమలు జరిపారు కొడుకులు. కట్లు విడిపోయినా పైకి లేచి నిలబడ గలిగే శక్తి లేకపోయింది కుటుంబరావుకి. పెద్దిరెడ్డి స్వయంగా వచ్చి చేయి ఆసరా ఇచ్చాడు. "చూసావా! చెప్పిన మాట ముందినుంటే యిలా జరిగేదా? సర్లే – జరిగింది మర్చిపో! నువ్వేం కావాలన్నా యిస్తా. ముందీ ముండకి కడుపు తీసెయ్!"

కుటుంబరావుకి ఏం చెప్పాలో తోచటం లేదు. ఏం చేయాలో తెలియటం లేదు. మెదడు మొద్దుబారినట్లుగా వుంది. రంగారెడ్డి మందుల సంచీ తెచ్చి ముందు పెట్టి త్వరగా కానివ్వమంటూ తొందరపెట్టాడు.

తాను యింజక్షను చేయించుకోనంటూ గబుక్కున లేచి గది గుమ్మం వైపు పరిగెత్తింది రత్తాలు. పెద్దిరెడ్డి కేక పెట్టడం – అతని కొడుకులు వేట కుక్కల్లా గెంతి ఆమెను పట్టుకోవటం క్షణంలో జరిగిపోయాయి. "పారిపోతావుంటే ముండా?" అంటూ రత్తాలు జుట్టు పట్టుకొని గుంజి, నేల మీద కూలేసి, చెంపలు వాయించి, డొక్కలో తన్ని, వెన్ను వంచి దబదబ బాదాడు వీరారెడ్డి.

"అలాక్కాదురా అన్నయ్యా! దాని పని చెప్పుతానుండు" అంటూ గది గోడల మధ్య నున్న దూలం మీదుగా మోకు వేసి ఉరితాడు క్రింద కట్టాడు తమ్ముడు రంగారెడ్డి.

వీరారెడ్డి రత్తాల్ని బరబర యీడ్చుకువచ్చాడు. రంగారెడ్డి ఆమె మెడకి ఉచ్చు తగిలించాడు. అన్నయ్య రత్తాలు చేతులు వెనక్కి విరిచి పట్టుకున్నాడు. తమ్ముడు ఉరితాడు గట్టిగా లాగి పట్టుకున్నాడు. రత్తాలు మునివేళ్ళ మీద మాత్రం నిలబడి ఉంది. ఒక అరంగుళం తాడు పైకి లేస్తే – ఉరితాడు ఆమె కంఠం ముడి మీద బిగుసుకుపోకమానదు?

"ఇంకెక్కడికి పోతుంది ముండ! ఇంజక్షను పొడవ్వయ్యా మాస్టరూ!" అని కేక పెట్టాడు

రంగారెడ్డి.

'అయ్యో! వీళ్ళామెను చంపేసేలా ఉన్నా'రని గిలగిల లాడిపోయాడు కుటుంబరావు. తను చచ్చిపోవటానికయినా సిద్ధంగా ఉంది కాని, వాళ్ళకి లొంగ కూడదన్నట్టు గిజగిజ గింజుకుంటోంది రత్తాలు. అంతవరకు జరిగింది చూస్తూ అఘాతం తగిలిన దానిలా కూర్చున్న చోటనే కూలబడి పోయింది సుబ్బమ్మ.

"సుబ్బమ్మా! నీ కూతురు చచ్చిపోతుంది" అని కంగారుగా కేక పెట్టాడు కుటుంబరావు.

సుబ్బమ్మ ఒక్క ఉదుటున లేచి వచ్చి "నా కూతుర్నొగ్గెయ్యండి బాబో!" అంటూ రంగారెడ్డి చేతుల్లోంచి తాడు లాగెయ్యాలని గింజులాడింది.

"పోవే ముండకానా!" అంటూ ఒక అడుగు వెనక్కి వేసి సుబ్బమ్మను గట్టిగా ఒక తాపు తన్నాడు రంగారెడ్డి.

ఆ దెబ్బ ఆమె గుండెలకి బలంగా తగలటమే కాకుండా ఆ విసురుకి గోడకి వెళ్ళి కొట్టుకుని దబ్బుమని క్రింద పడి పోయింది సుబ్బమ్మ.

"చచ్చిందేమోరా ముండ?" అని అరిచాడు పెద్దిరెడ్డి.

"అమ్మో!" అంటూ పెద్దగా అరిచి ఏడవసాగింది రత్తాలు.

"నోరెత్తావంటే చంపేస్తాను ముండా" అంటూ తాడు బలంగా లాగి పట్టుకున్నాడు రంగారెడ్డి.

"సుబ్బమ్మ కదలటం లేదు. ఇలా వచ్చి చూడవోయ్" అని కుటుంబరావుని కేక పెట్టి పిలిచాడు పెద్దిరెడ్డి.

భయంతో గజగజ వణికిపోతూ వెళ్ళి సుబ్బమ్మ చేయి పట్టుకు చూసాడు కుటుంబరావు. నాడి అందలేదు. కంగారుగా మందుల సంచీ తెచ్చి దాంట్లోని స్టెతస్కోపు తెచ్చి పరీక్షించాడు.

వివర్ణమయిన అతని ముఖం చూసి, "చచ్చిపోయిందేమిటిరా?" అని కంగారుగా అడిగాడు పెద్దిరెడ్డి.

నోటమాటరాక తల వూపాడు కుటుంబరావు.

"కొంప ముంచింది కదరా ముండ?" అన్నాడు తల పట్టుకుంటూ.

రత్తాలు గొల్లుమంది. అన్నగారి చేతికి వురితాడు కొస అందించి తండ్రి దగ్గరికి వెళ్ళి చెవిలో ఏదో గొణిగాడు రంగారెడ్డి.

కుటుంబరావు వాళ్ళవైపు భయం భయంగా చూసాడు.

"రెడ్డిగారూ!"

పెద్దిరెడ్డి అతని దగ్గరగా వచ్చాడు. "చూడు మాస్టరూ! కూతురు కడుపు తీయించి కావల్సినంత డబ్బిచ్చి పంపుదామనుకున్నా. ఏమీ అక్కర్లేదని ఒక్క తన్నుకే ఆ ముండ చచ్చూరుకుంది. నువ్వే చెప్పు - చంపాలని దాన్ని చంపాడా మా వాడు?"

"లేదండయ్యా! లేదు" అన్నాడు కుటుంబరావు వణుకుతున్న కంఠంతో.

"ఇంక నువ్వు దీన్ని కడుపు తీయటం ఎందుకు? దాన్ని కూడా వాళ్ళమ్మకాడికే పంపే స్తాము" అన్నాడు పెద్దిరెడ్డి నెమ్మదిగా.

"నన్ను సంపకండి దొరా! సంపకండి!" రత్తాలు అరుస్తూంది.

"అయ్యా – అయ్యా! ఆగండయ్యా!" అని కుటుంబరావు చేతులడ్డు పెడుతూనే వున్నాడు. కాని, అప్పటికే వీరారెడ్డి, రంగారెడ్డి యిద్దరూ కలిసి తాడు పట్టుకుని బలంగా లాగేసి కిటికీ వూచకి కట్టేసారు.

రత్తాలు ఏడుపు ఆగిపోయింది. ఆమె కాళ్ళు గాలిలో తేలిపోయాయి. ఆమె కంఠం ముడిమీద ఉరితాడు బిర్రబిగుసుకుపోయింది.

"ఆc!...." ఆపైన నోట మాటరాక కుప్పగా నేలమీద కూలబడిపోయాడు కుటుంబరావు. అతని చేతుల్లో స్టెతస్కోపు అలాగేవుంది. అతని కళ్ళకెదురుగా రత్తాలు కాళ్ళు చేతులు కాసేపు గిలగిల కొట్టుకున్నాయి. అంతే! మరి కాసేపటికి  అవి కదలటం మానేసాయి. కాడల్లా వ్రేలాడిపోయాయి.

వాళ్ళు ఎప్పుడు తాడు వదిలిపెట్టి రత్తాల్ని క్రిందికి దించారో కుటుంబరావుకి తెలియదు. అతని భుజం మీద కొట్టి, "మాస్టరూ! ఆ చేత్తో దీన్ని కూడా పరీక్ష చేసి చెప్పవోయ్!" అని అడిగాడు పెద్దిరెడ్డి చాలా నెమ్మదిగా.

పిచ్చివాడిలా చూసాడు కుటుంబరావు.

"చచ్చిందో లేదో త్వరగా చూసి చెప్పు!" అని కేక పెట్టాడు రంగారెడ్డి.

కుటుంబరావు పరీక్ష చేసి చెప్పాల్సిన అవసరం లేక పోయింది. నిర్జీవంగా వికృతంగా మారిపోయిన రత్తాలు ముఖం వాళ్ళకే జరిగింది చెపుతూంది!

కుటుంబరావుకి గుండెలు దడదడలాడుతున్నాయి. కళ్ళ నీళ్ళు తిరుగుతున్నాయి. తను చూస్తుండగా రెండు నిండు ప్రాణాలు బలయిపోయాయి. భయం భయంగా ఆ తండ్రీ కొడుకుల్ని కలయజూసాడు. ఒక్క దూకులో అక్కడ్నించి పారిపోయి తన ప్రాణాలు రక్షించుకోవాలని వుంది. కాని అతనికి కాళ్ళు బిర్రబిగుసుకుపోయినట్టయి పోయాయి.

"చూసావా మాస్టరూ! చెప్పిన మాట వెంటనే వినకపోతే యిలాగే జరుగుతుంది" అన్నాడు పెద్దిరెడ్డి.

"నేను... నేను... యింజక్షను..."

"నువ్వు యింజక్షను యిద్దామనే అనుకుంటున్నానంటావు యివ్వడు. కాని, యివ్వమనగానే మర్యాదగా యిచ్చావా? చావనేనా చస్తాను కాని యివ్వను పొమ్మన్నావు. నీ ఆలస్యం మూలంగానే ఆ ముండలు చచ్చారుకున్నారు."

"లేదు – లేదండయ్యా! మాట వరుసకి నోరు జారాను. నన్ను క్షమించండి!"

"సరే, ఈ సంగతులేవీ మాటవరుసకి కూడా నోరు జారి ఎవ్వరితోనూ చెప్పనని అంటావు."

కుటుంబరావు ఆశగా తల వూపాడు. "చెప్పను - ఎవ్వరితోనూ చెప్పను. నా .. నా మాట నమ్మండి" అన్నాడు చేతులెత్తి దండం పెడుతూ.

"కాని, నువ్వు వూరందరికీ కావల్సిన వాడివి. చెప్పకుండా వుండలేవు. నువ్వెవరికీ చెప్ప కుండా ఉండాలంటే..." అని కొడుకులవైపు చూసాడు పెద్దిరెడ్డి.

వాళ్ళిద్దరూ ఒక్కసారిగా కుటుంబరావు మీదపడి చేతులు విరిచి వెనక్కి పట్టుకున్నారు. రత్తాలు మెడ నుంచి వదులు చేసి తీసిన ఉరితాడు కుటుంబరావు మెడకు తగిలించాడు పెద్దిరెడ్డి.

"నే నన్నమాట నిలబెట్టుకుంటాను. నీ కూతురు పెళ్ళికి సాయం చేస్తాను. నీ కొడుక్కి ఉద్యోగం వేయిస్తాను. ఇక నువ్వు నిశ్చింతగా ఉండు" అంటూ పెద్దిరెడ్డి సంజ్ఞ చేశాడు. అతని కొడుకులు తాడు గట్టిగా పట్టుకుని లాగేసారు. కుటుంబరావు కాళ్ళు గాలిలో తేలిపోయాయి. అతని చేతిలోంచి స్టెతస్కోప్ క్రిందపడిపోయింది!

ఆ మర్నాడు ప్రొద్దున్న సుబ్బమ్మ గుడిసెలో ఆమె శవాన్ని చూసి, వూళ్ళోవాళ్ళు చెపితే వెళ్ళి చూసి, నిద్దట్లో గుండాగి చచ్చిపోయిందని అన్నారు పెద్దిరెడ్డిగారు. "రత్తాలెక్కడుందో వెదికి దానికి కబురు చెప్పండి పాపం! కడసారి చూపయినా దక్కుతుందన్నా"రాయన.

ఆ వేళ మధ్యాహ్నానికి తామర చెరువులో రత్తాలు శవం తేలితే, "పాపం! తామర పువ్వులు తెచ్చుకోవటానికని వెళ్ళి ఊబిలో దిగబడిపోయినట్టుంది." అన్నారు పెద్దిరెడ్డి గారు. అంతే అయివుంటుందనుకున్నారు వూళ్ళో ప్రజలందరూ కూడా.

ఆ సాయంత్రమే తల్లీ కూతుళ్ళ శవాల్ని దగ్గరుండి తమ ఖర్చుతో దహనం చేయించారు పెద్దిరెడ్డిగారు. ఆయన ఉదాతరకు ఊళ్ళోవాళ్ళు ముగ్ధులైపోయారు. ఆయన్ని ఎంతో పొగిడారు.

రెండోనాడు ప్రొద్దున్న పొలాల మీద నుంచి వస్తున్న వాళ్ళెవరో దిగుడు బావిలో ఏదో శవం తేలిందని కబురు చేరవేశారు. ఈసారి పోలీసులు వచ్చారు. కుటుంబరావు శవాన్ని, అతని మందుల సంచీని కూడా బయటికి తీసారు. పెద్దిరెడ్డిగారు 'దగ్గరుండి' శవ పంచాయితీ జరిపించారు.

"పాపం ! ఎవరికో వైద్యం చేయటానికి పొరుగూరికి వెళ్ళి రాత్రి వేళ చేలకడ్డం పడి వస్తూ చీకట్లో కనపడక నూతిలో పడి పోయుంటాడు." అన్నారు పెద్దిరెడ్డిగారు. పోలీసులంతే అయివుంటుందని రాసుకుపోయారు.

మాస్టరిగారి దహన సంస్కారానికయిన ఖర్చంతా పెద్దిరెడ్డిగారే భరించారు. అతని కొడుకుని దగ్గరకు తీసుకొని ఎంతో ఓదార్చారు.

కుటుంబరావు కుటుంబం మీద పెద్దిరెడ్డిగారికి కలిగిన సానుభూతిని, అభిమానాన్ని లోకులంతా ఎంతో కొనియాడారు!

•